క్లుప్తంగా

ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

నకిరేకల్ : నకిరేకల్ లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్, సూర్యాపేట అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలపై ఆన్‌లైన్‌లో మే 2 నుంచి జూన్ 3 వరకు ఉచితంగా వేసవి శిక్షణ ఇస్తున్నామని నిర్వాహకులు బ్రహ్మదేవర నరేష్, తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకు శిక్షణ ఉంటుందన్నారు. 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివే విద్యార్థులు జాయిన్ కావొచ్చన్నారు. గణితం, ఓరియెంటేషన్, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, కరాటే, డ్యాన్స్, మ్యూజిక్, కంప్యూటర్, ధ్యానం, యోగా, వ్యక్తిత్వ వికాస తరగతులను అనుభవం కలిగిన అధ్యాపకులతో ఆన్‌లైన్లో శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. వివరాలకు 9299552066, 9705717176 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

'స్థాయికి మించి విమర్శలు చేయడం సరికాదు'

నల్లగొండ టూటౌన్ : కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి తన స్థాయికి మించి విమర్శలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు చిట్ల వెంకటేశం, యామ దయాకర్, మునాసు వెంకన్న అన్నారు. ఆదివారం స్థానిక గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం తర్వాత ప్రోటోకాల్ ఉన్న వ్యక్తి గుత్తా సుఖేందర్‌రెడ్డి అని, అలాంటి వ్యక్తిపై మోహన్‌రెడ్డి విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మందడి మధుసూదన్‌రెడ్డి, కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం తగదు

చిట్యాల : నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యపై కొందరు మీడియాలో చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఖండిస్తున్నట్లు చిట్యాల మండలం వెంబావి గ్రామ దళిత బంధు పథకం లబ్ధిదారులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా తమ గ్రామంలోని అర్హులైన దళితులందరినీ దళిత బంధు పథకానికి ఎంపికయ్యేలా ఎమ్మెల్యే కృషి చేశారని బోగరి నర్సింహ, పి.ప్రసాద్, బి.మహేష్, వి.కృష్ణ, బి.కృష్ణయ్య, యాదయ్య, స్వామి, రవి, ముత్తయ్య తెలిపారు.

గుండెపోటుతో వాటర్‌మెన్ మృతి


జోజి (ఫైల్)

కేతేపల్లి : మండలంలోని భీమారం గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ వాటర్ మెన్ దేవరకొండ జోజి(60) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. జోజి స్థానిక గ్రామ పంచాయతీలో 20 ఏళ్లుగా పని చేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున జోజికి ఛాతిలో నొప్పి రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు జోజిని చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు జోజికి భార్య, కూతురు ఉన్నారు. ఈ మేరకు స్థానిక సర్పంచ్ బడుగుల శ్రీనివాస్‌యాదవ్ జోజి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులకు రూ.13వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట ఉప సర్పంచ్ స్వప్న, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడు మృతి

మునుగోడు : మండలంలోని గూడపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు నన్నూరి సుధాకర్‌రెడ్డి(63) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని మాజీ ఎంపీపీ పోలగోని సత్యం గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నన్నూరి విష్ణువర్ధన్ రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహగౌడ్, మాదగోని యాదయ్య గౌడ్, నక్క వెంకన్న, రడం వెంకన్న, గోసుకొండ స్వామి తదితరులు పాల్గొన్నారు.

కంచుకట్ల సుభాష్‌కు సన్మానం


సుభాష్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, తదితరులు

మర్రిగూడ : ఫ్లోరైడ్ రక్కసిని పారదోలేందుకు నడుం బిగించి, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కంచుకట్ల సుభాష్‌కు డాక్టరేట్ రావడం అభినందనీయమని ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కంచుకట్ల సుభాష్‌ను ఘనంగా సన్మానించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని ప్రజా ఉద్యమాలు చేపట్టి విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బచ్చు రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్లు బాలం నర్సింహ, పందుల యాదయ్య, పందుల రాములుగౌడ్, మారగోని వెంకటయ్య, రాపోలు యాదగిరి, బూరుగు నాగరాజు, పందుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కంచుకట్ల సుభాష్‌ను కాంగ్రెస్ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సిరిపంగి శ్రీనివాస్, పల్లె నర్సింహ, ఇబ్రహీం పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కరువు

- పని ప్రదేశాల్లో నిలువ నీడ లేక ఉపాధి కూలీల ఇబ్బందులు
- అందుబాటులో లేని టెంట్లు, మెడికల్ కిట్లు, తాగునీరు


బొప్పారంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కేతేపల్లి: ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలకు పని ప్రదేశాల్లో కనీస వసతులు కరువయ్యాయి. అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సరైన వసతులు కల్పించకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. కేతేపల్లి మండలంలో 16 గ్రామపంచాయతీలు ఉండగా అధికారులు 10,690 జాబ్‌కార్డులు జారీ చేశారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేకపోవడంతో అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం రోజువారీగా 2500 నుంచి 3000 మంది వరకు కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఈ ఏడాది నూతన విధానం అమలు చేయడంతో కూలీలు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఎండలో పనిచేయాల్సి వస్తుంది. పని ప్రదేశం వద్ద కూలీలు పనిచేసే ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాతే కూలీలు ఇంటిబాట పట్టాలని, లేదంటే హాజరు పడదని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కాగా వేసవిలో ఎండ నుంచి రక్షణకు టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీటి వసతి కల్పించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు.

ఇళ్ల వద్ద నుంచే తాగునీరు

ఉపాధి పనులు చేసే చోట కనీసం తాగునీరు కూడా అందించడం లేదు. దీంతో కూలీలు తమ ఇళ్ల వద్ద నుంచే బాటిళ్లలో నీటిని తెచ్చుకుని తాగుతున్నారు. గతంలో కూలీలే ఇంటి నుంచి తాగునీరు తెచ్చుకుంటే రోజుకు రూ.5, వేసవిలో మూడు నెలల పాటు అలవెన్స్‌లు చెల్లించేవారు. కొత్త సాఫ్ట్‌వేర్ వచ్చిన తర్వాత వాటి ఊసే లేకుండా పోయింది. కూలీలు పని ముగించుకుని కాసేపు నీడపట్టున సేద తీరేందుకు గతంలో టెంట్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం టెంట్లు అందుబాటులో లేకపోవడంతో ఎండకు తట్టుకోలేని కూలీలు చెట్ల నీడనే సేద తీరుతున్నారు.

మెడికల్ కిట్ల ఊసేలేదు..

కూలీలు పనిచేసే చోట తరచూ ప్రమాదాల బారిన పడే అవకాశముంది. కూలీలకు ఏదైనా గాయాలైతే ప్రథమ చికిత్స చేయడానికి మెడికల్ కిట్లు, ఎండకు నీరసించి, వడదెబ్బ తగిలిన వారికి తాగించడానికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఎక్కడా కూడా అందుబాటులో ఉంచడం లేదు. సిబ్బందిని అడిగితే మాకు ఇవ్వడం లేదని అంటున్నారని కూలీలు వాపోతున్నారు.

ఎలాంటి వసతులు లేవు



మేము ఉపాధి పనులు చేసే చోట ఎలాంటి వసతులు ఉండడం లేదు. ఎండలోనే పనులు చేస్తున్నాం. నీడ కోసం చెట్లను ఆశ్రయిస్తున్నాం. తాగునీటి సౌకర్యంతోపాటు మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలి. చేసిన కూలి పనికి వెంటనే డబ్బులు వచ్చేలా చూడాలి.

– ముండ్ల మల్లయ్య, ఉపాధి కూలీ, కేతేపల్లి

అందుబాటులో ఉండే విధంగా చూస్తాం



గతంలో కూలీలు పనిచేసే చోట టెంట్లు, పారలు వంటివి ప్రభుత్వం నుంచి వచ్చేవి. ఐదారేళ్లుగా రావడం లేదు. వేసవిలో కూలీలకు ఇచ్చే అలవెన్స్‌లు కూడా తొలగించారు. మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూస్తాం. జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ పని కల్పిస్తాం.

– సురేందర్, ఏపీఓ, కేతేపల్లి

సాయి మందిరంలో ఘనంగా రుద్రాభిషేకం


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలోని ఐశ్వర్యసాయి మందిరంలో మందిర 16వ వార్షికోత్సవ, శ్రీ జ్ఞాన సరస్వతీ దేవి అష్టమ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం మహన్యాస పూర్వక రుద్రాభిషేకములు, 108 కలశాలతో ఫల సుగంధ పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. శ్రీలక్ష్మీ గణపతి సహిత నవగ్రహ హోమాలు నిర్వహించారు. వార్షికోత్సవాల సందర్భంగా రెండోరోజు ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. అన్నమయ్య కళాసమితి ప్రతినిధి గండేపల్లి సుమలత ఆధ్వర్యంలో సాయి కీర్తనలతో అలరించారు. ప్రముఖ వ్యాపారవేత్త కందాల శ్రీనివాస్‌రెడ్డి–శోభ దంపతులు అన్నదానం చేశారు. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ వేడుకల్లో పాల్గొని సాయినాథుడిని దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ కాసం లింగయ్య, ప్రధాన కార్యదర్శి బొల్లం సత్తయ్య, ట్రస్ట్ ఉపాధ్యక్షులు యాట మధుసూదన్‌రెడ్డి, గట్టు శ్యాంసుందర్, వనమా వెంకటేశ్వర్లు, కోశాధికారి ముప్పారం శ్రీనివాస్, ఆలయ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరికలు

కేతేపల్లి : బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల వారు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో వివిధ పార్టీలు, కుల సంఘాలకు చెందిన 100 కుటుంబాల వారు మాజీ ఎంపీటీసీ చిర్ర చంద్రయ్య ఆధ్వర్యంలో ఆదివారం నకిరేకల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలను తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలుచేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో రావుల చిన మల్లయ్య, రావుల లింగరాజు, రాములు, గౌని సర్వయ్య, బయ్య సతీష్, కడెం గణేశ్, రావుల శంకర్, అర్వ గంగయ్య తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కేతేపల్లి జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం వెంకట్‌రెడ్డి, చిమట వెంకన్న, కె.సైదిరెడ్డి, అనుముల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాసవీమాత జయంతి ఉత్సవాలు


పూజలో పాల్గొన్న మహిళలు

చిట్యాల : ఆర్యవైశ్యుల కులదైవం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి మాత జయంతి ఉత్సవాలు ఆదివారం చిట్యాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆర్యవైశ్య సంఘం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పందిరి గీతారమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గణపతి పూజ, సామూహిక కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. 11 సంవత్సరాలలోపు అమ్మాయిలు కన్యక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు తేరటుపల్లి హనుమంతు, వాసా విద్యాసాగర్, మాజీ మార్కెట్ చైర్మన్ పందిరి శ్రీనివాస్, ఉమాశంకర్, పోల ధనమ్మ, బెలిదే నర్మద, కలకుంట్ల రవి, ప్రవీణ్, పొద్దుటూరి శ్రీను, వనమా హైమా, అరుంధతి, శీల సత్యనారాయణ, విమల, వెంకన్న, శ్రావణ్, ప్రవీణ్, నవీన్ ఉన్నారు.

మే డేను విజయవంతం చేయాలి

నకిరేకల్ : మే డే వేడుకలను విజయవంతం చేయాలని బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్ కోరారు. నకిరేకల్‌లో ఆదివారం జరిగిన బీఆర్‌టీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, ఆశ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు సింగం రేణుక, నాయకులు బానోతు వెంకన్న, దాసరి సుధాకర్, పట్టేటి పాండు, వంటిపాక కృష్ణ, బట్ట యాదయ్య, గొర్ల సోమయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

భారత కార్మిక సమాఖ్య సంఘాల(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో నకిరేకల్‌లో నిర్వహించే మే డే వేడుకలను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన ప్రచార పోస్టర్‌ను ఆదివారం ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గద్దపాటి శంకర్, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జేరిపోతుల వెంకన్న, మహేష్, నాగరాజు, కృష్ణ, మంగమ్మ, పార్వతమ్మ, కేతమ్మ, పద్మ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా

నకిరేకల్ : దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల పేర్లను సీఎం కేసీఆర్ బయటపెట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నకిరేకల్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోడ సునీల్ మాదిగ, చెడిపల్లి రాఘువరన్, వంగూరి ప్రసాద్, జిల్లా లింగయ్య, జాని అశోక్, అరుణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో ..

నల్లగొండ రూరల్ : దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలపై తక్షణమే క్రిమినల్ కేసు పెట్టి, వచ్చే ఎన్నికల్లో వారిని అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఎంఎస్‌పీ(మహాజన సోషలిస్టు పార్టీ) ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ సీనియర్ నాయకుడు బకరం శ్రీనివాస్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ ఇరిగి శ్రీశైలం, కొమిరే స్వామి, కురుపాటి కమలమ్మ, మోహన్, దేవయ్య, వెంకన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

మునుగోడు : మండలంలోని కిష్టాపురంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ పనులు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం పదోరోజు కొనసాగాయి. దీక్షలకు వివిధ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. ఫార్మా వ్యతిరేఖ కమిటీ చైర్మన్ భీమనపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రసంగాన్ని వీక్షించిన బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ ప్రసంగాన్ని ఆదివారం నల్లగొండలో బీజేపీ నాయకులు ఎల్ఈడీ స్క్రీన్‌పై వీక్షించారు. ప్రధాని మోదీ ప్రసంగాన్ని వీక్షించేందుకు బండారు గార్డెన్‌లో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా మర్రిగూడలో వీరెల్లి చంద్రశేఖర్, సూర్యనగర్‌లో కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డితో సహ పలువురు కార్యకర్తలు, నాయకులు ప్రధాని ప్రసంగాన్ని విన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ కౌన్సిలర్ రావిరాల పూజిత వెంకటేశ్వర్లు, చర్లపల్లి గణేశ్, ఏమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బీవంగి జగ్జీవన్‌రామ్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

నల్లగొండ రూరల్ : కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంట్రాక్ట్ అధ్యాపకులు వివిధ శాఖల ఉద్యోగులు ఆదివారం స్థానిక కేపీ జూనియర్ కళాశాల వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు వెంకటాద్రి, కొండల్, హన్సారి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, శేఖర్, మురళి, ఖాదర్, నగేష్, నర్సింహారావు, దేవమణి, ఆయేషా, ప్రసన్న లక్ష్మి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి


పుల్లెంల గ్రామంలో మాట్లాడుతున్న సత్యం

చండూరు : పెండింగ్‌లో ఉన్న వెల్మకన్నె ఫీడర్ ఛానల్, శేషిలేటి వాగు పనులు పూర్తిచేసి మునుగోడు, చండూరు, గట్టుప్పల మండలాల్లో భూగర్భ జలాలు పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర 11వ రోజు చండూరు మండలం ధోనిపాముల, బంగారుగడ్డ, ఇడికూడ, పుల్లెంల, నెర్మట, కొండాపురం. గ్రామాలకు చేరుకుంది. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించే డిండి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజయ్యచారి, కే శ్రీనివాస్, బచ్చనగోని గాలయ్య, జి.రామచంద్రన్, టి వెంకటేశ్వర్లు, బొలుగురి నరసింహ, నలపరాజు రామలింగయ్య, గిరి రమ, నలపరాజు సతీష్, పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, గంట రమేష్, ఊశయ్య, మాదగోని విజయలక్ష్మి, బరిగల వెంకటేష్, బోయపల్లి భిక్షమయ్య, జంగయ్య, పల్లె శంకరయ్య, అరుణ్ పాల్గొన్నారు. పాదయాత్రకు బీఆర్ఎస్ మండల నాయకులు సంఘీభావం తెలిపారు. బంగారుగడ్డలో మాదగోని వెంకటేష్, పెద్దగోని వెంకన్న, జక్కలి రవీందర్, సర్పంచ్ పల్లె వెంకటేశం, ఇడికుడలో సర్పంచ్ నల్ల లింగయ్య, పుల్లెంలలో యాదవ సంఘం నాయకులు స్వాగతం పలికారు.

నల్లగొండ : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి, బీ వెల్లంల ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రావణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా సమగ్ర అభివృద్ధికి చేపట్టిన ప్రచార జాత ఆదివారం నల్లగొండకు చేరుకున్న సందర్భంగా భాస్కర్ టాకీస్ సెంటర్లో సభ నిర్వహించారు. పట్టణంలో వివిధ వార్డుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నల్లగొండ జిల్లాపై సవతి తల్లి ప్రేమ చూపడం వల్లనే 8 సంవత్సరాలుగా ప్రాజెక్టులను పూర్తి చేయలేదని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలో రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి గాదపాక రమేష్, ముండ్ల ముత్యాలు, నీతి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కనగల్‌లో..

కనగల్ : బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్ట్, ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి కాల్వలను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్ అన్నారు. నల్లగొండ జిల్లా సమగ్రాభివృద్ధికి సీపీఐ చేపట్టిన జీపు ప్రచార యాత్ర ఆదివారం కనగల్ మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనగల్ మండలంలోని పానుగోడు చెరువుకు లిఫ్ట్ ఏర్పాటు, దర్వేశిపురం ఆలయం సమీపంలో రెండు వరుసల వంతెన నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి, సీపీఐ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ, బోగరి రామకోటి, దోటి పాండయ్య, గట్టిగుండ్ల నర్సింహ, ఎలుగు వెంకటేశంలు పాల్గొన్నారు.

సాల్మన్‌రాజుకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలి


మాట్లాడుతున్న రేఖల భద్రాద్రి

రామగిరి (నల్లగొండ) : క్రిస్టియన్ ఎమ్మెల్సీగా గోనె సాల్మన్‌రాజుకు అవకాశం కల్పించాలని తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ నిర్ణయించిందని పాస్టర్ ప్రదీప్ సామెల్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేఖల భద్రాద్రి తెలిపారు. ఆదివారం పట్టణంలోని గడియారం చౌరస్తాలో గల సేంటినరీ బాప్టిస్ట్ చర్చిలో వారు మాట్లాడారు. నామినేటెడ్ ఎమ్మెల్సీగా ప్రస్తుతం కొనసాగుతున్న క్రిస్టియన్ ఎమ్మెల్సీ పదవీ కాలం ముగిసిందని, దక్షిణ తెలంగాణ ప్రాంతానికి చెందిన గోనె సాల్మన్‌రాజుకు ఈసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని సీఎంను కోరారు. సమావేశంలో పాస్టర్ కె ఎం మోజస్, సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్పీ జయప్రకాష్, ఉపాధ్యక్షులు జేపీ ప్రభుచరణ్, కార్యదర్శి దుబ్బ ఎలీషా, బీఆర్ మ్యాథ్యూస్, కోశాధికారి పీజే జేమ్స్, డీజే అబ్రహం పాల్గొన్నారు.

గతుకుల రోడ్డుతో ప్రయాణికుల అవస్థలు


గుంతలమయంగా ఉన్న రోడ్డు

మునుగోడు : మండల కేంద్రం నుంచి నల్లగొండకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరైనా పనులు చేపట్టడం లేదు. వివిధ పనుల నిమిత్తం నిత్యం వందలాది మంది మునుగోడు–నల్లగొండ ప్రధాన రోడ్డు వెంట రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డు కుంగి పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రోడ్డుకు మరమ్మతులు చేయించాలని పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు అనేకమార్లు ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. స్పందించిన అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. దీంతో గత ఫిబ్రవరి మాసంలో ప్రభుత్వం నాన్‌ప్లానింగ్ నిధుల నుంచి ఒక కోటి 30 లక్షల రూపాయలు మంజూరు చేసింది. ఆ నిధులతో మునుగోడు పెద్ద చెరువులోని తూము ద్వారా వచ్చే నీరు రోడ్డుపైకి రాకుండా అవసరమైన కల్వర్టుతో పాటు 560 మీటర్ల వరకు బీటీ రోడ్డు వేసేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. కానీ ఆ పనులను నేటికీ ప్రారంభించలేదు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటివరకు ఈ రోడ్డుపై దాదాపు 15కి పైగా ప్రమాదాలు చోటుచేసుకోగా పలువురి కాళ్లు, చేతులు విరిగిపోయాయి. మరికొంత మంది చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. ఇకనైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని రోడ్డు మరమ్మతులు చేయించాలని పలువురు వాహనదారులు వేడుకుంటున్నారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

మర్రిగూడ : రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని యరగండ్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధాన్యంలో తేమ శాతం 17కు మించకుండా తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బచ్చు రామకృష్ణ, మర్రిగూడ పీఏసీఎస్ చైర్మన్ పందుల యాదయ్య గౌడ్, సర్పంచ్ మాడం శాంతమ్మవెంకటయ్య, బాలం నర్సింహ, లాలునాయక్, అయిలి నర్సింహ, ఇబ్రహీం, సీఈఓ శ్రీనివాస్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉమ్మడి జిల్లాలో 12 సీట్లలో కాంగ్రెస్ విజయం'

నకిరేకల్ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 సీట్లకు 12 సీట్లు కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని కాంగ్రెస్ నేత దైద రవీందర్ ధీమా వ్యక్తం చేశారు. నకిరేకల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో నకిరేకల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో కేతేపల్లి ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు గాజుల సుకన్య, దైద స్వప్న, నాయకులు కంపసాటి శ్రీనివాస్, నర్సింహారెడ్డి, విజయ్, రాజశేఖర్, యూసఫ్, సతీష్, నర్సింగ్ మహేష్ నక్షత్, మహేష్, సాయి, పందిరి సతీష్ పాల్గొన్నారు.

హమాలీకి తీవ్ర గాయాలు

శాలిగౌరారం : ధాన్యం లోడు లారీ పైనుంచి కింద పడడంతో హమాలీకి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వల్లాల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వల్లాల గ్రామానికి చెందిన జాల నాగరాజు(30) గ్రామంలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం కేంద్రంలో ధాన్యం బస్తాలను లారీలో లోడు చేస్తుండగా వర్షం వచ్చింది. దీంతో టార్పాలిన్ కప్పేందుకు నాగరాజు లారీ ఎక్కాడు. ఈ సమయంలో ఒక్కసారిగా ఈదురులు గాలులు రావడంతో టార్పాలిన్ ఎగిరిపోయి కిందపడింది. టార్పాలిన్‌పై ఉన్న నాగరాజు కూడా కిందపడడంతో రెండు చేతులు విరిగాయి. వెంటనే అతడిని హమాలీలు నకిరేకల్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.


ఫార్మా కంపెనీ నిర్మాణాన్ని ఆపాలి

చండూరు(గట్టుప్పల) : గట్టుప్పల మండలంలో ఫార్మా కంపెనీ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని రైతు సంఘం జాతీయ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. ఆదివారం గట్టుప్పల మండల కేంద్రంలో పోరెడ్డి సత్తిరెడ్డి రెండో వర్ధంతిని పురస్కరించుకుని అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌటుప్పల మండలంలో ఫార్మా కంపెనీలతో ఏర్పడిన కాలుష్యం కారణంగా ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయగౌడ్, పోరెడ్డి రవీందర్ రెడ్డి, గట్టుప్పల సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి కర్నాటి సుధాకర్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలం కొత్తపల్లి గ్రామంలో గల గంగదేవమ్మ ఆలయంలో ఆదివారం హోమం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రొమ్ముల నాగయ్య, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, రావుల శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, వెంకటరమణా రెడ్డి, నర్సింహ, సైదులు, మల్లేశం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నల్లగొండలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఆదర్శ విద్యా మందిర్ పూర్వ విద్యార్థులు

రామగిరి (నల్లగొండ) : జిల్లా కేంద్రంలోని రామగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1989 నుంచి 1995 సంవత్సరాల్లో పదో తరగతి చదివిన విద్యార్థులు అందరూ కలిసి ఆదివారం పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 30 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని బాగోగులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి ప్రధానోపాధ్యాయుడు శారదా ప్రసాద్, ఉపాధ్యాయులు వెంకట జానకి, నిర్మల, గౌస్, సత్యవతి, మహేశ్వరి, మార్గరిత, సావిత్రి, సత్యమ్మ, పద్మజ, రుక్మిణి, పుల్లయ్యలను శాలువా మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు సునంద, కృష్ణప్రియ, వసంత, హరిణి, సుజాత, అరుణ, ఝాన్సీ, కల్పన, అమృత, ముంతాజ్, అనురాధ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ విద్యామందిర్ విద్యార్థుల సమ్మేళనం

హాలియా మున్సిపాలిటీలోని ఆదర్శ విద్యామందిర్‌లో చదువుకున్న 2002–03 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. 20 ఏళ్ల తరువాత స్నేహితులంతా ఒక్కచోట చేరి నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువా, మెమొంటోలతో సత్కరించారు.


చిట్యాల : సమ్మేళనంలో పాల్గొన్న నేరడ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

చిట్యాల మండలం నేరడలో..

చిట్యాల : మండలంలోని నేరడ ప్రభుత్వ హైస్కూల్‌లో చదివిన 2003–04 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యను బోధించిన గురువులకు పూలమాల వేసి శాలువా కప్పి జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. పాఠశాలకు రూ.18వేల విలువ చేసే జిరాక్స్ యంత్రాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, రాజు, ప్రదీప్, శ్రీను, రమేష్, మహేష్, లావణ్య, రాజేశ్వరి, అనురాధ, సరిత, విమల తదితరులు పాల్గొన్నారు.